01ATP17_01ATP17.qxd 17-08-2024 PM 10:58 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 18 ఆగష్టు 2024 పేజీలు : 04

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో రసవత్తరంగా సాగుతున్న

# కళ్యాణదుర్గం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

- ఫ్లడ్ లైట్ల కాంతులతో డే అండ్ నైట్ ఐపిఎల్ తరహాలో కెపిఎల్ క్రికెట్
- ఆదివారం ఫైనల్ మ్యాచ్‌ల కోసం మంత్రులు,జిల్లా ఎమ్మెల్యేల రాక

రసవత్తరంగా సాగుతున్న ఐపిఎల్ తరహా కెపిఎల్ క్రికెట్ పోటీలు

**కళ్యాణదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులలో క్రీడా స్ఫూర్తిని నింపి అంతర్జాతీయంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఐపిఎల్ తరహాలో "కళ్యాణదుర్గం ప్రీమియం లీగ్" (కెపిఎల్) క్రికెట్ పోటీలను డే అండ్ నైట్ తరహాల్లో యూట్యూబ్ ప్రత్యక్ష ప్రసారాలతో, ఎల్ఇడి స్క్రీన్‌ల ఏర్పాటుతో రన్నింగ్ కామెంటరీలతో, డిజె సంగీతంతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రారంభమైన ఈ పోటీలలో ప్రాంచైజర్ల అధ్వర్యంలో ఎంపిక చేసుకున్న 8 జట్లు ఈనెల 15వ తేది నుండి 17వ తేది వరకూ డే అండ్ నైట్ 32 మ్యాచుల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచిన జట్లు సెమీ ఫైనల్‌ల్లో పోటీ పడి ఫైనల్‌కు చేరుకున్న జట్లు ఈనెల 18వ తేదిన ఫైనల్ మ్యాచ్‌ల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అసక్తిగా, రసవత్తరంగా సాగే ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా భారీగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్రేక్షకులందరికీ వీక్షణ ఏర్పాట్ల కోసం గ్యాలరీలు కూడా ఏర్పాటు చేసారు. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్‌లో విజేత జట్టుకు రూ.2లక్షల నగదు, విజేత కప్, రన్నర్ జట్టుకు రూ.లక్ష నగదు, రన్నర్ కప్, తృతీయ విజేతకు రూ.50వేల నగదు, కప్‌ను బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించి విజేతలకు కప్‌లు, నగదు ప్రోత్సాహ బహుమతులు అందజేసేందుకు జిల్లాకు చెందిన మంత్రులు,మాజీ మంత్రులు, శాసనసభ్యులందరు విశిష్ట అహ్వానితులుగా హాజరు అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఎంతో ఉత్కంఠగా, ఉత్సాహంగా సాగుతున్న కెపిఎల్ పోటీలు జిల్లాలోనే తొలిసారి కావడంతో రేపటి ఫైనల్ మ్యాచులు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.ఈ కెపిఎల్ క్రికెట్ మ్యాచుల ఏర్పాట్లను గోపీ అధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించగా, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు యశ్వంత్ చౌదరి, మేనల్లుళ్లు ధర్మతేజ, అవినాష్‌లు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్నారు. మీడియా కో-అర్డినేటర్‌గా శ్రీనివాసులు వ్యవహరిస్తున్నారు.

# వికసిత్ ఆంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త**

వికసిత్ ఆంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో వికసిత్ ఆంధ్ర 2047పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ శాఖల పరిధిలో మూడు స్థాయిల్లో ప్రణాళికలు తయారు చేయాలని, అందులో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఒక సంవత్సరం ప్రణాళిక, వికసిత్ ఆంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఒక సంవత్సరం ప్రణాళికను అన్ని శాఖల అధికారులు అందించాలన్నారు. మూడు రకాల ప్రణాళికలు తయారు చేసేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. వికసిత్ ఆంధ్ర 2047కు సంబంధించిన ఐదు మంది జిల్లా అధికారులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి వెళ్లి రావడం జరిగిందని వారిచ్చే సూచనలు పాటించి జిల్లాలో వికసిత్ ఆంధ్ర 2047 కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలన్నారు. 124 శాఖల జిల్లా అధికారులంతా వారికి సంబంధించి కేటాయించిన జాబ్‌రోల్‌ను అందరూ చేరాలని, అధికారులు వారు ఏమి చేయాలనే దానిపై అవగాహన కలిగి వుండాలన్నారు. జిల్లా అధికారులు వారి కార్యాలయాన్ని నియంత్రణలో వుంచుకోవాలన్నారు. మనకున్న స్థాయి నుండి ప్రజలకు ఎంతో మేలు చేసే అవకాశం వుంటుందని మనందరి చేతుల్లో ఎంతో బాధ్యత వుందని ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. 24 గంటల్లోగా జిల్లా అధికారులంతా ఈ ఆఫీస్‌లోనే ఫైల్స్ పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐఎస్ఒ 9001:2015 సర్టిఫికెట్‌ను చేయించేందుకు ఈ నెలాఖరకు సమయం ఇవ్వడం జరిగిందన్నారు. అంతలోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సర్టిఫికెట్ చేయించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో వుండాలన్నారు. వచ్చే మంగళవారం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఇందుకోసం

హాజరైన అధికారులు

అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిపిఒ ప్రభాకర్‌రావు, డిటిసి వీర్రాజు, సిపిఒ అశోక్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి ఓబుళమ్మ, డిసిఒ మురళీకృష్ణ, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, పిఆర్ ఎస్ఇ ప్రసాద్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ప్రసాద్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్‌రెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూకొఠారి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, వికలాంగుల సంక్షేమశాఖ ఏడి రసూల్, డిఇఒ వరలక్ష్మి, పశు సంవర్ధకశాఖ జెడి సుబ్రమణ్యం, డిసిఒ శోభారాణి, ఏపిఎస్ఆర్టీసి ఆర్ఎం సుమంత్ ఆదోని, ఎస్‌డిసి ఆనంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 15% వృద్ధి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయండి

**-జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్**

**పుట్టపర్తి, ఆగస్టు 17, ప్రభాతవార్త**

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఉండాలన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యంను నెరవేర్చే విధంగా శ్రీసత్యసాయి జిఆల్లలో వచ్చే యేడాదికి 15% వృద్ధి సాధించే దిశగా జిల్లా ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, ఇఒ, పిఆర్‌డిలతో వికసిత్ ఆంధ్ర 2047 జిల్లా యాక్షన్ ప్లాన్ 2024-29 వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటాల్డఉతూ, జిల్లాకు చెందిన సమర్థవంతమైన ప్రణాళికలతో అధికారులు పని చేయాలని, నీతి ఆయోగ్ సహాయ సహకారంతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకొని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి 100 రోజులు, సంవత్సర ప్రణాళికలు

తయారు చేయడమైనదని తెలిపారు. 2047 నాటికి లక్ష్యాలను ఏర్పరుచుకొని అధిక వృద్ధి రేటు లక్ష్యంగా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రణాళికలు తయారు చేయబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్‌కుమార్, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌చాంద్‌బాషా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టి.బి.డ్యాంలో విజయవంతంగా పూర్తయిన

# స్టాప్ లాగ్ గేట్ ఎలిమెంట్ల ప్రక్రియ

**- నేటి నుంచి నదికి నీరు బంద్..... 70 టీఎంసీలకు పైగా నీటి నిల్వ....- రైతుల్లో ఆనందం..... ఇన్‌ఫ్లో ఉత్తమం**

టి.బి.డ్యాం 19వ క్రస్ట్ గేటు స్థానంలో విజయవంతంగా అమర్చిన ఎలిమెంట్ల దృశ్యం

**బళ్లారి, ఆగస్టు17, ప్రభాతవార్త**

తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేట్ స్థానంలో స్టాప్ లాగ్ గేట్‌ను అమర్చే కార్యాచరణ శనివారంనాడు సాయంత్రానికి విజయవంతంగా ఇంజనీర్ల బృందం పూర్తి చేసింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్యనాయుడు నేతృత్వంలో సుమారు వంద మంది దాకా ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది అత్యంత సాహసంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని సైతం లెక్క జేయకుండా స్టాప్ లాగ్ గేటుకు సంబంధించి ఎలిమెంట్‌లను అడుగుభాగం నుంచి భారీ క్రేన్‌ల సాయంతో అమర్చి కార్యాన్ని పూర్తి చేశారు. దీంతో అక్కడ హాజరైన అధికారులు, రాజకీయ నాయకులు, మంత్రులు, రైతులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుని పరస్పరం మిఠాయిలు తినిపించుని కార్యాచరణలో పాల్గొన్న ఇంజనీర్లకు అభినందనలు తెలిపారు. కన్నయ్యనాయుడిని భుజాలపై మోసుకుని డ్యాంపై భాగంలో ఊరేగింపు ఆనందడోళికల్లో తేలిపోయారు. దీంతో డ్యాం నుంచి వృథాగా ఉన్న పోతున్న నీటిని డ్యాం గేట్లు మూసివేసి నియంత్రించారు. డ్యాంలో ప్రస్తుతం 70కి పైగా టీఎంసీల నీటిని నిల్వ చేసినట్లయ్యింది. డ్యాంకు శనివారం కూడా ఇన్‌ఫ్లో పరిమాణం పెరిగింది. సకాలంలోనే డ్యాం తిరిగి భర్తీ అయ్యే అవకాశం ఉన్నదని, జలాశయం ఎగువ ప్రాంతంలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వృథాగా పోయిన 33 టీఎంసీల నీటిని తిరిగి భర్తీ చేసుకునే అవకాశం ఉందని కన్నయ్యనాయుడు మీడియా ప్రతినిధులకు చెప్పారు. తాత్కాలికంగా స్టాప్ లాగ్ గేట్‌ను అమర్చినట్లు, మున్ముందు శాశ్వతగేటును ఏర్పాటు చేయనున్నట్లు, దీని ద్వారా నీటి వృథాను అరికట్టినట్లు చెప్పారు. తన కార్యం నేటితో ముగిసినట్లు తెలిపిన ఆయన తన కార్యాచరణకు అన్నివిధాలుగా సహకరించిన టీబీ బోర్డు అధికారులు, ఇంజినీర్లు, సహాయక సిబ్బంది ఎలిమెంట్‌లను సమయానికి తగినట్లుగా సమకూర్చిన కంపెనీకి, భారీ క్రేన్‌లను ఈ కార్యాచరణ వినియోగానికి పంపిన జేఎస్‌డబ్ల్యూ జిందాల్ స్టీల్ ప్లాంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# కన్నయ్య కృషి కాలవ కృతజ్ఞతలు

**రాయదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త:**

తుంగభద్ర రిజర్వాయర్‌లో వారం క్రితం కొట్టుకు పోయిన 19వ నెంబర్ గేటుస్థానంలో స్టాప్‌లాగ్‌గేటు ఏర్పాటు విజయవంతమైనందుకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. నీటిప్రవాహం ఉధృ తంగా ఉన్న సమయంలో తాత్కాలిక గేటు ఏర్పాటును ఒక అద్భుతంగా ఆయన అభివర్ణించారు. ఈ ఏడాది జూలైలోనే టిబిడ్యాం పూర్తి సామర్థ్యం తో నిండడం కర్ణాటక, రాయలసీమ రైతుల్లో ఎంతో భరోసాను కలిగించిందన్నారు. అయితే ఈ నెల 10న ఉన్నట్టుండి రిజర్వాయరులో 19వ నెంబర్ గేటు కొట్టుకు పోవడంతో ఆయకట్టు రైతుల్లో భవిష్యత్తుపై నీలి నీడలు

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కమ్ముకున్నాయన్నారు. క్రస్టుగేటు స్థాయి దాకా నీటిని కిందకు వదిలిన తరువాతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తోలుత అధికారులు ప్రకటించడంతో రైతులు తీవ్ర నిరాశ చెందారన్నారు. అయితే ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో అధికారులు వారంలోపే స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అమర్చడం అమోఘమన్నారు. ఈ అద్భుతంలో పాలుపంచుకున్న అధికారులకు, కార్మికులకు, రాయలసీమ రైతుల పక్షాన కావ శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం సుమారు 73టిఎంసిల నీటిని నిలువ చేయగలిగారని, రిజర్వాయరుకు సుమారు 60వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడం ఎంతో సంతోషకరమని ఈ సందర్భగా కాలవ శ్రీనివాసులు తెలిపారు.

# లోపలికి వెళ్ళాలంటే భయం..బయటకు రావాలంటే భయం..!

వర్షపు నీరుతో నిండిపోయిన జిల్లా విద్యాశాఖ కార్యాలయం ప్రాంగణం

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**

వర్షం వచ్చిందంటే ఆ జిల్లా కార్యాలయానికి వెళ్ళాలంటే భయం...భయటకు రావాలంటే భయం. కార్యాలయం ఆవరణం గుంతలుగా ఉండటం...ఎక్కడికక్కడే వర్షపు నీరు నిల్వ ఉండటంతో తాము ఎక్కడ జారి పడుతామోనని ఉద్యోగులు భయాందోళనలకు గురవుతున్నారు. పాత జిల్లా కార్యాలయం మరుమత్తుల కోసం ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా...ఇంజనీర్లు పరిశీలించి అంచనాలు తయారు చేసి రిపోర్టు అందజేసినా...జిల్లా విద్యాశాఖ అధికారిణి మాత్రం నిధులు మంజూరు కోసం నేటికీ ప్రతిపాదనలు పంపించకపోవడం గమనార్హం.

అనంతపురం జిల్లా కేంద్రంలోని కమలానగర్‌లో సొంత భవనంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉండేది. కానీ తాత్కాలిక కార్యాలయాన్ని దాదాపు గత మూడు సంవత్సరాల క్రితం గిల్డాఫ్ సర్వీసు స్కూల్ ఆవరణంలోని ఇంగ్లీష్ మీడియం భవనం (ప్రస్తుతం ఫేస్ ప్రైవేట్ స్కూల్) లోకి తరలించారు. తాత్కాలిక కార్యాలయానికి వెళ్ళేందుకు పాఠశాల ప్రాంగణంలో నుంచి లోపలికి వెళ్ళాల్సివుంది. కానీ ఎప్పుడు వర్షం వచ్చినా ఆ ప్రాంగణం మొత్తం వర్షం నీరుతో నిండిపోతుంది. పైగా గుంతలుగా ఉండటంతో వర్షం నీరు నిల్వ ఉన్నప్పుడు లోపలికి వెళ్ళడానికి, తిరిగి భయటకు రావడానికి తాము ఎక్కడ జారి పడుతామోనని అధికారులు, ఉద్యోగులు, పలువురు ఉపాధ్యాయులు, వివిధ పనుల మీద ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి కూడా భారీ వర్షం రావడంతో ఆ

పాత కార్యాలయానికి పరిశీలిస్తున్న ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులు (ఫైల్)

కార్యాలయం ప్రారంగణం మొత్తం వర్షపు నీరుతో నిండిపోయింది. దీంతో పలువురు ఉద్యోగులు బైకులో వెళ్ళడానికి కూడా భయపడి గేటు భయటే తమ బైకులను నిల్వ ఉంచి నడుచుకుంటూ...అతి కష్టం మీద కార్యాలయం లోపలికి వెళ్ళి విధులు నిర్వహించారు. తిరిగి మధ్యాహ్నం భోజనంకు వెళ్ళినప్పుడు, తిరిగి కార్యాలయానికి వచ్చి తిరిగి సాయంత్రం వెళ్ళడానికి కూడా అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిల్వ ఉన్న వర్షపు నీరు ఇంకిపోయిన తర్వాత కూడా బురద నాలుగైదు రోజులకు ఆరిపోతుంది. అప్పటి వరకు ఆ కార్యాలయం లోపలికి వెళ్ళి, భయటకు రావడానికి అధికారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. ఇక వివిధ పనుల మీద కార్యాలయానికి వచ్చే టీచర్లు, ప్రజలు అక్కడ వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని చూసి ముందుకు వెళ్ళితే తాము పడుతామని భావించి వెనక్కి వెళ్ళి పోతున్నారు. కార్యాలయంలోకి రావడానికి, వెళ్ళడానికి ఉద్యోగులు, టీచర్లు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారిణిదే. కానీ ఆ అధికారిణికి కారు సౌకర్యం ఉండటం వలన వర్షం నీరు ఉన్నా, గుంతలు ఉన్నా నేరుగా కారులో వెళ్ళి, వస్తుంది. అలాంటప్పుడు క్రింద స్థాయి ఉద్యోగుల ఇబ్బందులు ఎలా తెలుస్తాయని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మరుమత్తుల నిధులు మంజూరు కోసం ఫైల్ పంపని డీఈవో :**

చిన్న చిన్న మరుమత్తుల పనులు చేయించుకొని వినియోగించాల్సిన పాత జిల్లా విద్యాశాఖ కార్యాలయం (సొంత భవనాన్ని)ను జిల్లా విద్యాశాఖ అధికారిణి గాలికి

- ఎప్పుడు వర్షం వచ్చినా ఇదే పరిస్థితి
- పాత డీఈవో ఆఫీసు మరుమత్తులకు అంచనాలు తయారు చేసిన ఇంజనీర్లు
- నిధులు మంజూరు కోసం నేటీకి ప్రతిపాదనలు పంపించని డీఈవో

వదిలేసిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పాత కార్యాలయానికి వదిలేసి...తాత్కాలిక కార్యాలయానికి ఫేస్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అద్దె చెల్లిస్తుందని గత నెల 31న వార్త దినపత్రికలో కథనం ప్రచురితం అయింది. ఈ కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. ఏడీ, డీఈ, ఏసీ, ఒక ఎంఈవో-2, ఇంజనీర్లు కలిసి అదే రోజు పాత జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పరిశీలించి అవసరం అయ్యే పనులు కోసం రూ.30 లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలు వేసి రిపోర్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేశారు. మరుమత్తుల కోసం కలెక్టర్‌కు ఫైల్ పంపించాల్సిన డీఈవో నేటికీ ఆ ఫైల్‌ను పంపకుండా నిర్లక్ష్యం చేస్తుందని పలువురు ఉద్యోగులు, టీచర్లు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా డీఈవో నిర్లక్ష్యం వీడి ఆ ప్రతిపాదనల ఫైల్‌ను వెంటనే పంపించి, నిధులు మంజూరు చేయ్యించి, మరుమత్తుల పనులు త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యాశాఖ,సమగ్రశిక్ష ఉద్యోగులు, టీచర్లు కోరుతున్నారు.

**ఆ ఫైల్ ఇంకా పంపించలేదు : డీఈవో బి.వరలక్ష్మి**

పాత జిల్లా విద్యాశాఖ కార్యాలయం మరుమత్తులు కోసం కావాల్సిన నిధులను మంజూరు చేయాలని ప్రతిపాదనల ఫైల్‌ను ఇంకా జిల్లా కలెక్టర్‌కు పంపించలేదు.ఆ ఫైల్ ఏడీల దగ్గర పెండింగ్‌లో వుంది. నా దగ్గరకు వచ్చిన వెంటనే ఫైల్ పంపిస్తాము.

# ఘనంగా పల్లె ఉమా జయంతి వేడుకలు

కేక్ కట్ చేస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి, పల్లె కిషోర్

**అనంతపురం, ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రతినిధి**

పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో పల్లె ఉమా జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు, సిబ్బంది, ప్రముఖులు పాల్గొని పల్లె ఉమాకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిషోర్, కరస్పాండెంట్ పల్లె రఘునాథ్‌రెడ్డి, ట్రెజరర్ పల్లె సింధూరరెడ్డిలు ఉమా సేవలను స్మరించుకుంటూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విజయవంతమైన మగవాడి వెనుక కచ్చితంగా ఒక ఆడది ఉంటుందనే అక్షర సత్యమని అన్నారు. బాలాజీ విద్యాసంస్థలో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ అనేక రంగాల్లో స్థిరపడటానికి పల్లె ఉమా కృషి ఎంతో ఉందన్నారు. ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ ఒక తల్లిగా తన జీవితాన్ని తీర్చిదిద్దటమే కాకుండా బాలాజీ విద్యాసంస్థల కరస్పాండెంట్‌గా వేల మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన పల్లె ఉమా సేవలు అభినందనీయమని అన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు, సమాజంలో పాజిటివ్ మార్పులకు వారు చేసిన కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో

పల్లె ఉమా సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

కేరళ డిజిపి శంకర్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్ఐవో పల్లె రామకృష్ణారెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, పివికెకె ఐటి ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, డీన్ సంతోష్‌రెడ్డి, ఏవో మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వైభవ్, తదితరులు పాల్గొన్నారు. ఉమా జయంతి సందర్భంగా బాలాజీ విద్యా సంస్థలలో అన్ని కళాశాలలో విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

02ATP27_02ATP27.qxd 17-08-2024 PM 10:52 Page 1



## సుగేపల్లివద్ద కోతకు గురైన రోడ్డు

కోతకు గురైన రోడ్డు

బ్రహ్మసముద్రం ఆగష్ట్ 17 ప్రభాతవార్త,

మండంలో శుక్రవారం రాత్రి మండల వ్యాప్తంగా వరుణుడు ఉగ్రరూపం దాల్చాడు మండల వ్యాప్తంగా 58 సెంటీమీట్ల వర్షపాతం నమోదుకాగా గ్రామాలలో వర్షాలకు కళ్యాణదుర్గంనుండి ఎరడికెరకు వెళ్లే రోడ్డు సుగేపల్లివద్ద కురిసిన వర్షానికి వంకపారడంతో రోడ్డు కోతకు గురైంది కోతకు గురైన రోడ్డుతో రాకపోకలకు కొడ్డిసేపు అంతరాయం ఏర్పడింది.

## తనభార్య నారత్నమ్మ వర్ధంతికి వృద్ధాశ్రమంలో అన్నదానం చేసిన ఎంపిపి పెద్దన్న

బెళుగుప్ప 17 ప్రభాతవార్త,

బెళుగుప్ప ఎంపిపి పెద్దన్న భార్య నాగరత్న మూడవ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం అనంతపురంలోని రాకేష్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు ఎంపిపి పెద్దన్న మామ నేటికలప్ప,వారి సంధ్యారాణి,కూతుళ్ళు శిరీషా,సుస్మా తల్లి హనుమక్క,కుమారుడు సాయికుమార్,కోడలు కుటుంభ సభ్యులతో కలిసి రకేష్ వృద్ధాశ్రమంలో వున్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి తనభార్య అత్మకుశాంతి చేకూరాలని కోరారు.

## సిఐను సన్మానించిన యువకులు, నాయకులు

డి.హీరేహాళ్, ఆగష్టు 17 ప్రభాతవార్త:

సిఐ కె.వెంకటరమణను సన్మానిస్తున్న నాగల్లి రాజు తదితరులు

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, ఆయా సామాజిక వర్గాలకు చెందిన యువకులు సిఐ కె. వెంకటరమణను సన్మానించారు. శనివారం ఆయన విధి నిర్వహణలో భాగంగా డి.హీరే హాళ్ పోలీస్‌స్టేషన్‌కి వచ్చారన్న సమాచారం అందుకున్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు, తెదేపా నాయకులు శ్రీరాము లు, శెట్టి తిప్పేస్వామి మరికొందరు తెదేపా తమ్ముళ్లతో కలిసి ఆయనను సన్మానించారు. మండల పరిధిలోని కల్యం గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు తిప్పేస్వామి తమ బృందంతో కలిసి సీఐను సన్మానించారు. మండల పరిధిలోని జాజరకల్లు, ఓబుళాపురం, సోమలాపురం, హీర్ధేహాళ్, మలపనగుడి తదితర గ్రామాలకు చెందిన ఆయా సామాజిక వర్గాల యువకులు సిఐను కలుసుకొని పలకరించి సన్మానించారు. ఈ సీఐ గతంలో డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లి సీఐగా పదోన్నతి పొంది రాయదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్లో సీఐ బాధ్యతలు చేపట్టారు. ఆయన డి. హీరేహాళ్ మండలంలోని అన్ని సామాజిక వర్గాల వారికి సుపరిచితుడు కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చి ఆయనను సామాజిక వర్గాలకు, రాజకీయ ఎపార్టీలకు అతీతంగా సన్మానించారు.


సీఐను సన్మానిస్తున్న తెదేపా నాయకులు కల్యం తిప్పేస్వామి తదితరులు...

## దోషులను కఠినంగా శిక్షించాలి....

నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

డి.హీరేహాళ్, ఆగష్టు 17 ప్రభాతవార్త:

కోల్కత్తాలో విధి నిర్వాహణలో ఉన్న శిక్షణ మహిళ వైద్యురాలిపై దాడి చేసి హత్యాచారం చేసి హత్య చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి నాజినీన్, సూపర్వైజర్ జి.శాంతకుమారి, సిబ్బందితో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని, ఆ కుటుంబానికి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహారాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని బాధిత వైద్యాధికారిణి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా దేశ వ్యాప్తంగా మహిళా వైద్యులకు, మహిళా సిబ్బందికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్‌లు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి....

రాయదుర్గం రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

నేడు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు రాయదుర్గం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు ప్రజలకు తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో మరియు పట్టణంలో ఉన్నటువంటి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎవరైనా పాత మిద్దెలల్లో ఉన్నటువంటి వారు అందులో నివాసం ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎక్కడ లేనట్లయితే సంబంధిత గ్రామ పరిధిలో ఉన్నటువంటి పాఠశాలల్లో ఉండవల్సిందిగా కోరారు. అర్ధరాత్రి అయినా కూడా ఎదైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే తహసీల్దార్ల కార్యాలయానికి లేదా మీ గ్రామ పరిధిలో ఉన్నటువంటి గ్రామ రెవెన్యూ అధికారులకు మరియు వార్డు రెవెన్యూ అధికారులకు తెలియజేయాల్సిందిగా మండల ప్రజలను ఆయన కోరారు.

## ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి గరుడ వాహన ఉత్సవం...

రాయదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త:

స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపాన వెలసిన శ్రీ విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకి ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో వచ్చే రెండో శనివారంలో నరసింహ స్వామివారికి పల్లకి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ కమిటి గౌరవాధ్యక్షులు రామ్మూర్తిస్వాజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యంస్వామి శ్రీ లక్ష్మి సమేత స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకుపూజ, నైవేద్యం పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టించి మేళ తాళాలతో ఊరేగించారు. మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాలు వినియోగం గావించారు. శ్రావణమాసం రెండవ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి బళ్లారి నివాసులైన, బెంగళూరు వాసులైన సహకారంతో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు బిఎన్.తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు జిఎం. నరసింహులు, ఎస్ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, సభ్యులు గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో ఉన్న వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిపిన నింధితులను వెంటనే శిక్షించాలి

రాయదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త:

వినాకసర్కిల్‌లో నిరసన చేస్తున్న వైద్యు సిబ్బంది

ఈ నెల 9వ తేదీన రాత్రి కోల్కత్తాలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా వైద్యురాలిపై సామూహిక అత్యాచారం జరిపిన నింధితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్ఇండెంట్ మాధవి, డాక్టర్ ఉమామహేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వైద్యులు మరియు సిబ్బంది విధులు బహిష్కరించి ఆసుపత్రి నుండి వినాయకసర్కిల్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై ఇటువంటి ఘటన జరగడం దారుణమని, నేరస్తులపై త్వరితగతిన సిబిఐ నేర పరిశోధన పూర్తిచేసి ప్రత్యేక కోర్టులో విచారణ జరిపి, నింధితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆసుపత్రులోన్ల వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు మరియు వైద్య సిబ్బందికి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర స్థాయిలో వైద్యుల ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రకటించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సిబ్బంది రక్షణ చట్టం(11ఆఫ్2008)ను సవరించి ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కఠిన తరంగా చేయాలని తెలిపారు. ఇటువంటి ఘటనలకు మా న్యాయమైన డిమాండ్లకు ప్రజలు మద్దతు కూడా ఉండాలని తెలిపారు. ఐఎంఏ పిలుపుమేరకు ఈ నెల 17వ తేదీన ఉదయం 6గంటల నుండి 18వ తేదీ ఉదయం 6గంటల వరకు 24గంటల పాటు వైద్య సేవలను నిలిపివేయడం జరిగిందన్నారు. వైద్య సిబ్బందికి కేంద్ర రక్షణ చట్టం చేయాలని, ఇటువంటి ఘటనకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫారం మరియు నోటుపుస్తకాలు పంపిణీ....

రాయదుర్గం రూరల్, ఆగస్టు 17 ప్రభాతవార్త:

యూనిఫారంలు అందిస్తున్న దృశ్యం...

మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో ఎంపి యూపి పాఠశాలలో శనివారం పాఠశాల విద్యాకమిటి ఛైర్మెన్ వి.వన్నూరుస్వామి అధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు మరియు యూనిఫారంలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా మాజీ ఆర్మీ(బిఎస్ఎఫ్) జోగప్ప, వాల్మీకిసిద్దప్ప, బోయ సిద్దప్ప తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం జోగప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పుస్తకాలు, యూనిఫారంలు, మధ్యాహ్నబోజనం పథకాలను సద్వినియోగం చేసుకొని సక్రమంగా పాఠశాలకు హాజరై బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రస్తుతంరాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మధ్యాహ్న పథకం బోజనాన్ని సీతక్క మద్యాహ్నబోజనం పథకమని పేరుమార్పుచేసి, మెనులో మార్పులు చేసి మంచి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని, పాఠశాలకు అవసరమైన నిధులు సక్రమంగా అందిస్తారని, ఈ అవకాశాన్ని విద్యార్థులకు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. మురళిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగుదేశంపార్టీ బోయ కుమార, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని హత్యాచారంపై వైద్యులు, సిబ్బంది నిరసన

-ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారం, బాధ్యులను శిక్షించాలని డిమాండ్

బెలుగుప్ప, ఆగస్టు 17 ప్రభాతవార్త

కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారంపై బెలుగుప్ప మండల కేంద్రంలో శనివారం వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి స్థానిక పీహెచ్‌సీ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. వైద్య విద్యార్థిని హత్యాచార బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, శ్రీరంగాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లోకేష్, డాక్టర్ ఋషికేష్, సూపర్‌వైజర్ వెంకటమరణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సర్కిల్‌లో నిర్వహిస్తున్న మానవహారంలో మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి

## అత్యాచార ఘటనపై నిరసన ప్రదర్శన

ర్యాలీ చేస్తున్న డాక్టర్లు

హిందూపురం టౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త

కలకత్తాలో జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు హిందూపురంలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరసింహారెడ్డి నేతృత్వంలో డాక్టర్లు బ్యానర్లు చేతబూని ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చంద్రకిరణ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సుప్రవీణ్, ఇటి రామ్మూర్తి, లోకేంద్రనాథ్, షాన్‌వాజ్‌ఖాన్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థిని దారుణహత్యకు నిరసనగా ర్యాలీ

చిలమత్తూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్యకు నిరసనగా మండల కేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీతో పాటు మండల కేంద్రంలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు అనుబంధ ఆర్ఎంపి వైద్యుల సంఘం మద్దతు పలికింది. ఈ మేరకు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ వైద్యులపై రోజు రోజుకు హత్యలు, బెదిరింపులు ఎక్కువై పోతున్నాయన్నారు. వైద్య విద్యార్థిని దారుణంగా హత్య చేసిన దుండగులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని, వైద్యుల కోసం ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తేజశ్విని, సిబ్బంది, ఆర్ఎంపి వైద్యుల సంఘం నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎగరని జెండా శీర్మికకు స్పందన

10మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

కంబదూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త

వార్త ప్రభావం

మండలంలోని అండేపల్లి గ్రామ సచివాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎగరని జాతీయ జెండా అనే కథనం ఈ నెల 16వ తేదీన వార్త తెలుగు జాతీయ దిన పత్రికలో ప్రచురితమైంది. దీంతో వార్త కథనానికి స్పందించిన ఎంపిడిఓ సాల్మన్ అండేపల్లి గ్రామ సచివాలయంలోని 10 మంది సిబ్బందికి క్రమశిక్షణ చర్యలు కింద షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా వారికి ఒకరోజు జీతం నిలుపుదల చేస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. మూడురోజుల్లో ఉన్నత అధికారులకు సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

## వర్షానికి నీట మునిగిన పంట పొలాలు

కంబదూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త

నీటమునిగిన పంటను చూపుతున్న రైతు

మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి పలు పంటలు నీట మునిగాయి. వర్షం బీభత్సానికి జిక్కిరెడ్డివల్లిలోని హరిజన మారెప్ప అనే రైతుకు సంబంధించిన 484-2 సర్వే నంబర్‌లో గల రెండు ఎకరాల పొలం నందు సాగుచేసిన టమోటా పంట గత రాత్రి కురిసిన వర్షానికి నేలపాలైనటు రైతు వాపోయారు. అదేవిధంగా మర్రిమాకుల పల్లిలో 1.50 ఎకరాల వరి పంట 3.50 ఎకరాల విస్తీర్ణంలో కంది,ములకనూరులో 4.50 ఎకరాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలు వర్షం ధాటికి పూర్తిగా నీట మునికి దెబ్బతిన్నాయని ఆయా రైతులు తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ శాఖ అధికారి జాఫర్ మీడియాకు తెలిపారు. దీంతో పంటకు పెట్టుబడి కింద పెట్టిన లక్షలాది రూపాయలు నీటిపాలుకావడంతో రైతులు బాధను వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షానికి నష్టమైన పంటలకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపి ఆర్థిక సాయం చర్యలు తీసుకోవాలని వారు వ్యవసాయశాఖ అధికారులను వేడుకున్నారు.

## వైద్యురాలి మృతికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలి...

గుమ్మఘట్ట, ఆగస్టు 17 ప్రభాతవార్త:

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది....

కోల్కత్తాలో ఆర్‌జికెఏఆర్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి కిరాతకంగా హత్యచేసిన ఘటనను ఖండిస్తూ ఇలాంటి ఆకృత్యాలు జరగకుండా ప్రతి ఒక్కరూ మేల్కొనాలని సూచిస్తూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నింధితులను కఠినంగా శిక్షించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యుల రక్షణ ప్రభుత్వ బాధ్యతని, బాధిత అమ్మాయి కుటుంబానికి తక్షణం న్యాయం చేసి, రక్షణ కల్పించాలన్నారు. మూర్ఖులను కఠినంగా శిక్షించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందేష్, సిహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆది బయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిఎస్ అనూష, ఫరీదాబాను, హేమలత, చాందిని, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు, స్టాఫ్ నర్సులు, పిహెచ్‌సిలు పాల్గొన్నారు.

## సోల్లాపురం-హనకనహాల్ వంతెన నిర్మించండి మహాప్రభో...

కణేకల్లు, ఆగస్టు 17 ప్రభాతవార్త:

జెసిబి సహాయంతో వంకను దాటుతున్న ప్రజలు...

మండలంలోని హనకనహాల్ గ్రామం నుండి సొల్లాపురంకు మరియు బెలుగుప్పకు వెళ్లేదారిలో వంకలు ఉండడం వలన చిన్నపాటి వర్షానికి రాకపోకలు బంద్ అయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కురిసన చిన్న పాటి వర్షానికి ప్రతి ఏటా సుమారు 10,20సార్లు వంకలు ప్రవహిస్తూ ఉంటాయి. ఈ వంకలు ప్రవహిస్తున్నప్పుడల్లా ఆ ఊరి నుండి ఈ ఊరికి, ఈ ఊరి నుండి ఆ ఊరికి రాకపోకలు పూర్తిగా బంద్ అవుతున్నాయి. బస్సులు, రైతులు, కూలీలు, స్కూల్ బస్సులు, వంక దాటడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా అత్యవసర సమయమై హాస్పెటల్‌కి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. ప్రాణాలు పోవాల్సిందే. వంక దాటుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. జెసిబి సాయంతో అతి కష్టం మీద వంకను దాటుతున్నట్లు ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించి హనకనహాల్-సొల్లాపురం మధ్యలో ఊరి వంకకి బ్రిడ్జి నిర్మించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

## కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలి

-ప్రభుత్వ అసుపత్రి నుండి నల్లబ్యాడ్జీలతో ర్యాలీ-టీ సర్కిల్‌లో మానవ హారం

కళ్యాణదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త

కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్యకు నిరసనగా డాక్టర్ల నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో విధినిర్వహణలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటన అత్యంత దారుణమని, నిందితులెవరైనా కఠినంగా శిక్షించాలని పలువురు డాక్టర్లు డిమాండ్ చేసార. శనివారం స్థానిక ప్రభుత్వ అసుపత్రిలో విధులను బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించి అసుపత్రి నుండి ఊరేగింపుగా టీ సర్కిల్ చేరుకుని, అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా డాక్టర్లు చరణ్, స్వప్న,శ్వేత, ఎన్‌జిఓల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవలు మాట్లాడుతూ అడది ఒంటరిగా స్వేచ్ఛగా తిరగల్గినపుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని మహాత్మాగాంధీ చెప్పినప్పటికీ, 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో ఇంకా మహిళలకు రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నిర్భయలాంటి చట్టాలు చేసినా మహిళలపై అత్యాచారాలు సాగుతూనే ఉన్నాయన్నారు. చట్టాలను కఠిన తరం చేసి మహిళకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసారు.కలకత్తాలో వైద్యవృత్తిలో డాక్టర్లు ప్రాణాపాయస్థితిలో ఉన్న వారి ప్రాణాలు రక్షించేందుకు కృషి చేస్తారని, అలాంటి ప్రాణాలు కాపాడే డాక్టర్ల ప్రాణాలను అత్యాచారం చేసి, హత్య చేయడం అత్యంత దారుణమన్నారు.మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించేవారిపట్ల ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేసి నేరస్థులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రాజేష్‌కుమార్, సీనియర్ డాక్టర్లు ఎన్‌వికె రాయలు, వెంకటేశులు, శివప్రకాష్, ప్రకాష్,వినియోగదారుల సంఘం అధ్యక్షులు కిశోర్‌కుమార్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ఎపియుడబ్ల్యుజె అవిర్భావ దినోత్సవ వేడుకలు

-రోగులకు బ్రెడ్లు-పండ్లు పంపిణీ

కళ్యాణదుర్గం, ఆగస్టు 17 ప్రభాతవార్త

అసుపత్రిలో రోగులకు బ్రెడ్డు-పండ్లు పంచిపెడుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సంఘం ఎపియుడబ్ల్యుజె అవిర్భావ దినోత్సవ వేడుకలను కళ్యాణదుర్గం పట్టణంలోని జర్నలిస్టులు వేడుకగా జరుపుకున్నారు. పట్టణ ప్రధాన కూడలి టీ సర్కిల్ నుండి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా ప్రచుత్వ అసుపత్రికి చేరుకుని అక్కడ రోగులకు బ్రెడ్లు-పండ్లు పంచిపెట్టారు.అనంతరం జిల్లా జర్నలిస్టుల సంఘం ఉపాధ్యక్షులు కరణం తిప్పేస్వామి, స్తానిక నియోజకవర్గ అధ్యక్షులు రవీంద్రలు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల సాధన కోసం ఎపియుడబ్ల్యుజె నిరంతర పోరాటంతో జర్నలిస్టులకు అండగా ఉంటోందన్నారు. ఎపియుడబ్ల్యుజె కృషితోనే హెల్త్‌కార్డులు, అక్రిడేషన్లు, పలుచోట్ల ఇంటిపట్టాలు సాధించుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ఉమ్మడి జిల్లాల వెటరన్ జర్నలిస్టుల సంఘం ఉపాధ్యక్షులు లింగప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యవ్యవస్థలో నాలుగో స్థంభంగా కీర్తించబడుతున్న ప త్రికారంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల కోసం ఎపియుడబ్ల్యుజె సంఘం అలుపెరగనిరీతిలో ఉద్యమస్ఫూర్తితో పోరాడుతోందన్నారు.అయినా ఇంకా కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పదవీ విరమణ చేసిన సీనియర్ జర్నలిస్టులకు పొరుగు రాష్ట్రాల్లో పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నా మన రాష్ట్రంలో మాత్రం కమిటీ పరిశీలన పేరుతో తీవ్ర జాప్యం జరగుతోందన్నారు. రాష్ట్రంలో నమోదుచేసుకున్న వెటరన్ జర్నలిస్టులు కేవలం వెయ్యి మందికి మించి జీవిస్తున్నవారు లేరని, కనుక జాప్యం లేకుండా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసారు. అలాగే అరోగ్య చికిత్సల కోసం స్టేట్ బస్సుపాసులు, జిల్లా కేంద్రాల్లో ఇల్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో వలి, మల్లికార్జున, ఇషాక్, సోమశేఖర్,రమేష్, నరసింహయాదవ్,షఫి,తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి స్పెషల్ జైలులో ఉచిత వైద్యశిబిరం

గుత్తి, ఆగస్టు 17 ప్రభాతవార్త

వైద్యశిబిరాన్ని జిల్లా జడ్జి ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి స్పెషల్ జైలులో రిమాండ్‌లో వున్న ఖైదీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని స్థానిక 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక జైలులో శనివారం కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఈసిజి, రక్త, మధుమేహ, తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ

## నిందితులను కఠినంగా శిక్షించాలి

- సిహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి
- వైద్యసేవలను నిలిపివేసి ర్యాలీ చేపట్టిన ప్రభుత్వ వైద్యులు

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ వైద్యులు

పామిడి, ఆగస్టు 17 ప్రభాతవార్త

కలకత్తాలో విధినిర్వాహణలో ఉన్నటువంటి వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేయటం ధుర్మార్గం అని వెంటనే సంఘటనకు కారకులైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైద్యురాలిపై అత్యాచారం చేసి హతమార్చిన ఘనటలో సత్వర న్యాయం కావాలంటూ ఇండియన్ మెడికల్ అసోషియేషన్ పిలుపు మేరకు శనివారం వైద్యసేవలను నిలిపివేసిన ప్రభుత్వ వైద్యులు పట్టణంలో ర్యాలీ చేపట్టిన డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మినారాయణరెడ్డి, సిఐ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య సిబ్బందికి కేంద్రం రక్షణ చట్టం చేయాలని, ఆంధ్రప్రదేశ్ వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. వైద్య వృత్తిని దైవంతో సమానం అంటారని తెలియజేస్తూ వైద్యసేవలను అందిసూ్తన్న పునర్జన్మను ఇస్తున్న వైద్యులకే రక్షణ కరువవ్వటం బాధాకరం అన్నారు. కలకత్తా వైద్యురాలిపై అత్యాచారం చేసి హతమార్చిన సంఘటన యావత్ భారతదేశ వ్యవస్థకు తీవ్రవిఘాతం కలిలింగే విధంగా తయారైందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను అమలు చేస్తూనే సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ కమలాకర్, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ సుధాకర్, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి, శ్రీసాయి హాస్పటల్ వైద్యులు డాక్టర్ చిలకల సాయికిరణ్, ప్రథక చికిత్స కేంద్రాల నిర్వాహకులు మస్తానయ్య, నాగమల్లారెడ్డి, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పల్లె ఉమా జయంతి వేడుకలు

పల్లె ఉమా జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా 62వ జయంతి వేడుకలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం, కొండకమర్ల టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ జయచంద్ర ఆధ్వర్యంలో పల్లె ఉమా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడే భారీ కేక్ కోసి పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ..... పల్లె ఉమా పుట్టపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారన్నారు. ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉన్నట్లు చరిత్ర చెబుతోందన్నారు. అందుకు పల్లె ఉమా గారే నిదర్శనం అన్నారు. డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి ప్రతి విజయం వెనుక పల్లె ఉమా ఉన్నారన్నారు. ఇప్పటికీ పల్లె ఉమాగారు లేని లోటు స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఎందిరికో ఆమె పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకారం అందించి ప్రజల మదిలో దేవతలా నిలిచిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. పల్లె ఉమాతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కొందరు మహిళ నాయకులు భావోద్వేగానికి గురయ్యారు. పల్లె ఉమా అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, నాయకులు జెరిపిటి అంజినప్ప, ఆర్ఎంపి జాకీర్ అహ్మద్, సర్పంచ్ రేణుకాబాయి, ఎంపీటీసి శ్రీనివాసులు, రాజారెడ్డి, అంజిన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, చంద్రాయుడు, గంగాద్రి, నిజాం, బాలక్రిష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సూరి, మస్తానమ్మ, అఖిలా, బడిశం సురేష్, సాదీ నాగరాజు, రమణారెడ్డి, విజయ్, ఆనంద్‌రెడ్డి, రామ్‌శెట్టి, ఎస్ఎంసీ ఛైర్మెన్ శ్రీనివాసులు, చాంద్‌బాష, షబ్బీర్, డీలర్ షమూన్, బోనాల రామాంజినేయులు, కుమార్ రాయల్, బిళ్లూరు శ్రీనివాసులు, ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త

మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు మొత్తం నలుగురు సభ్యులు ఉంటారని, వారిలో మాన్యువల్ స్కావెంజర్ లేదా పారిశుద్ధ్య కార్మికుల కోసం పని చేసే స్వచ్ఛంధ సంస్థ (ఎన్‌జీవోలు) ప్రతినిధులు ఇద్దరు, మాన్యువల్ స్కావెంజర్స్ లేదా పారిశుద్ధ్య కార్మికుల సంఘంలో ఇద్దరు ఉంటారని, వారిలో ఒకరు మహిళా సభ్యులుగా ఉంటారన్నారు. ఆసక్తి గలవారు తమ పూర్తి వివరాలతో ఈనెల 21వ తేదీ లోపు జిల్లా షెడ్యూల్ కులముల సంక్షేమం మరియు సాధికారత కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

## పల్లెసీమలు అభివృద్ధి చెందితే దేశంలో పేదరికం నిర్మూలన

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త

పూజలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్

పల్లెసీమలు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందితే దేశంలో పేదరికం నిర్మూలన సాధ్యం అవుతుందని ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని సున్నం పల్లిలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామ వికాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారఖ్ శ్రీరామ్ భరత్ కుమార్ హజరై మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసే రైతులు రోజురోజుకు తగ్గిపోతున్నారన్నారు. ప్రస్తుతం రైతులు తమ పిల్లలకు ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. గ్రామాలలో రైతులు పండించే పంటలు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడడం వలన భూమి నాశనం అవుతోందన్నారు. పూర్వం రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల ద్వారా ఆహారం పండించే వారని దానివల్ల పెట్టుబడి తక్కువగా ఉండి రైతులకు ఆదాయం సంవృద్ధిగా వచ్చేదన్నారు. గ్రామాలలో దేశవాళీ జాతి సంబంధించిన గోవులు పూర్తిగా కనుమరుగవుతున్నాయన్నారు. దేశవాళీ జాతి గోవుల పేడ, మూత్రంలో చాలా ఔషదగుణాలు ఉన్నాయన్న సంగతి శాస్త్రీయంగా నిరూపితం అయిందన్నారు. గోవులను పెంచి పోషించేందుకు పశుగ్రాసం కొరత గ్రామాల్లో ఏర్పడిందంటే అందుకు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడమే కారణం అన్నారు. ఒ రైతు పంట పండిస్తే ఆ ఫలసాయాన్ని కొన్ని వందల జీవరాసులు ఆకలితీరుతుందన్నారు. కనుక ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంటలు పండించి గ్రామాల పట్టణాలకు పట్టుకొమ్ములు అని మరోసారి నిరూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాసం రాష్ట్ర సంయోజకలు తిరుపతయ్య, విభాగ సంయోజక సున్నంపల్లి చంద్ర, కిసార్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్‌కుమార్‌రెడ్డి, రామమోహన్, సురేష్, హరి ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారఖ్ లక్ష్మణ్‌జీ, ప్రతాప్, హర్ష, వీరు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నాపా వీరాంజనేయులు మృతి టిడిపికి తీరనిలోటు

ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు.

అనంతపురం రూరల్,ఆగస్టు17ప్రభాతవార్త:

నాపా వీరాంజనేయులు భౌతికాయానికి నివాళ్ళులర్పిస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాపా వీరాంజ నేయులు మృతి టిడిపికి తీరనిలోటని ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజ నేయులు,తెలుగు యువత రాష్ట్ర ఉప్యాక్షులు వకటప్ప, అధికార ప్రతినిధి లక్ష్మి నసింహా,గంగాధర తెలిపారు. శనివారం వారు నాపా వీరాంజనేయులు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళ్ళులంచి కుటుంబ సభ్యుల్లను పరమర్శించి అధైర్య పడకండి మీకు టిడిపి,అదే విధంగా పరిటాల కుటుంబ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

## ఆలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించిన డిప్యూటి డియంహెచ్‌ఓ

ఉచిత వైద్య శిభరంను పరిశీలిస్తున్న డిప్యూటి డిఎంహెచ్‌ఓ నాగేంద్ర

నల్లచెరువు, ఆగస్టు 17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని శ్రీపాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం నందు శ్రావణమాసం సందర్భంగా వచ్చే భక్తులకు డాక్టర్ కల్పనారెడ్డి ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటుచేశారు. వైద్య శిభిరానినికి కదిరి డిప్యూటి డిఎంహెచ్‌ఓ నాగేంద్ర తనిఖీ నిర్వహించడం జరిగింది. వైద్య శిభిరానికి వచ్చిన ఓపి రిజిష్టర్‌ను పరిశీలించి దర్శనానికి వచ్చిన భక్తులు సృహకోల్పోవడం, బిపి డౌన్ కావడం వంటి వాటిపై తగు జాగ్రత్తలు పాటిస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ వైద్య శిభిరంలో సిహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ముస్తఫా, సూర్యనారాయణరెడ్డి, ఏఎన్‌యంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌కో ఏఈ, లైన్‌మెన్‌ల నిర్వాక ఫలితం

- విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రగాయాలపాలయైన ఒప్పంద కార్మికుడు ఆరాఫత్
- జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు
- ట్రాన్స్‌కోలో ఉద్యోగం ఒకరిది విధులు మరొకరివి
- ఈ తంతుకు బ్రేక్‌డౌన్ పడేది ఎప్పుడు పడుతుందో ?

చికిత్స పొందుతున్న ఆరాఫత్

కదిరి, ఆగస్టు 17, ప్రభాతవార్త

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య ఫలితంగా ముక్కుపచ్చలారని ఒ ఒప్పంద కార్మికుని నిండు జీవితం గాలిలో దీపంలా మారింది. విద్యుత్ శాఖలో ఆ శాఖకు సంబంధించిన పనులు అనగా విద్యుత్ తీగల మరమ్మత్తులు, 11కేవి మార్పులు, ఇతర ట్రాన్స్‌ఫార్మర్‌ల మార్పిడితో పాటు బ్రేక్‌డౌన్ అయినప్పుడు పెద్ద విద్యుత్ తీగలు సరిచేయాలంటే ఆశాఖలో పనిచేస్తున్న సీనియర్ వర్కర్లు, లైన్‌మెన్‌లు దగ్గర ఉండి ఆ పనులను చేయాలని స్పష్టమైన ఆదేశాలు, నియమ నింబంధనలు ఉన్నాయి. అయితే అందుకు భిన్నంగా నల్లమాడ మండలానికి చెందిన కింది స్థాయి అధికారుల నిర్వాకం వల్ల ఒ కార్మికుని ప్రాణాల మీదకు తీసుకువచ్చారనే అపవాదును మూట గట్టుకున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... గత రాత్రి కురిసిన తీవ్ర వర్షాల వల్ల నల్లమాడ మండలం కొత్తపల్లి తాండా వద్ద విద్యుత్ పెద్ద లైను బ్రేక్ డౌన్ అయింది. దీంతో అక్కడ విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మత్తులకు ఉపక్రమించారు. అయితే అక్కడ మరమ్మత్తులు చేసే క్రమంలో అక్కడ ఉన్న విద్యుత్ స్థంబంపై ఎక్కి పెద్దలైను విద్యుత్ తీగలను సరిచేయాల్సి ఉంటుంది. కాగా ఈ ప్రక్రియను చేసే క్రమంలో బ్రేక్ డౌన్ అయిన తీగలలో విద్యుత్ సరఫరా అవుతోందా లేదా.... విదు ్యత్ ఏ లైన్‌లో సరఫరా అవుతోందన్న కోణంలో ట్రాన్స్‌కో ఏఈ లేదా లైన్‌మెన్ లాంటి అనుభవం ఉన్న వారు పర్యవేక్షణ చేసి ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా ఆ ఫీడర్‌లో పనిచేసే లైన్‌మెన్ ఒప్పంద కార్మికునికి విద్యుత్ స్తంభాన్ని ఎక్కించి లైన్‌ను మరమ్మత్తులు చేయాల్సిందిగా హుకుం జారీ చేశాడు. ఇటీవలే పోల్‌టుపోల్ వర్కర్‌గా విధుల్లోకి చేరిన ఓడీచెరువు మండల కేంద్రానికి చెందిన తుమ్మల ఆరాఫత్‌ను పురమాయించాడు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవ అన్న చందాన సదరు లైన్‌మెన్ చేసిన నిర్వాకం వల్ల ఒప్పంద కార్మికుడు ఆరాఫత్ బ్రేక్ డౌన్ అయిన విద్యుత్ తీగలను సరిచేయాలని చూడగా ఒక్కసారిగా తీవ్ర విద్యుత్ ఘాతం చెలరేగి మంటలు ఒల్లంతా వ్యాపించి పై నుంచి కింద పడ్డాడు. అతనికి తలమీద, కాలు, తొడలు, మర్మాంగ అవయవాల వద్ద తీవ్రంగా కాలినట్లు కదిరిలో చికిత్స చేసిన డాక్టర్లు తెలిపారు. జరిగిన సంఘటనను తెలుసుకున్న తోటి ఉద్యోగులు, తల్లిదండ్రులు హుటాహుటిన కదిరి నుంచి బెంగళూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కాగా జరిగిన ఈ సంఘటనపై బాధిత కుటుంబ సభ్యులు గౌస్‌ఫీరా, జౌళి బాబాలు మాట్లాడుతూ.... ఒప్పంద కార్మికులను కేవలం విద్యుత్ బకాయిలకుఇతర ఆ శాఖకు సంబంధించిన విధుల్లో మాత్రమే ఉపయోగించుకోవాలనే నియమ నిబంధనలు ఉన్నాయని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు. అయితే విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కొంతమంది పర్మనెంట్ ఉద్యోగులు లక్షలాది రూపాయలు వేతనాలు తీసుకుంటూ తమ విధులను నిర్వర్తించకుండా ఒప్పంద కార్మికులతో తమ పబ్బం గడుపుకుని తూతూమంత్రంగా తమ పనులను చక్కబెట్టుకుంటున్నారన్నారు. ఒప్పంద కార్మికులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కదిరి డివిజన్‌లో ఎదో ఓ చోట జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇందుకు ఉదాహరణగా ఓడిసి మండలం ఉగ్గిరెడ్డిపల్లిలో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందగా తిప్పేపల్లికి చెందిన ఒప్పంద కార్మికుడు గణేష్ ఇలాగే విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తూ తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై చావుబతుకుల మధ్య పోరాడి ఇటీవలే విదుల్లోకి చేరాడన్నారు. విద్యుత్ ఘాతానికి గురై చావుబతుకుల మధ్య ఉన్న అరాఫత్ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే అతనికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జౌళి బాబా డిమాండ్ చేశాడు.

## ఎస్ఐ ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు

ఎస్ఐ ఈశ్వరయ్యకు పుష్పగుచ్ఛాం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు.

అనంతపురం రూరల్,ఆగస్టు17ప్రభాతవార్త

అనంత రూరల్ మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్యను కక్కలపల్లి కాలనీ మాజీ సర్పంచ్ సుశీలమ్మ ప్రకాష్ ఆధ్వర్యంలో పిల్లిగుండ్ల కోటర్స్ టిడిపి నాయకులు ప్రసాద్,సూరి,నాగన్న,శంకరనారాయణలు శనివారం ఎస్ఐ ఈశ్వరయ్య ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు పుష్పగుచ్ఛాం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 21న ఎస్సీ,ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజల కోసం స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఖుష్బూ కొఠారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఎస్సీ, ఎస్టీ ప్రజలు వారి ఫిర్యాదులను అందజేయడానికి ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పంచాయితీ కార్యదర్శి బి.అశోక్‌బాబు సేవలు అమోఘం

- రాజకీయ నాయకులు,పంచాయితీ అధికారులు.

ఉత్తమ పంచాయితీ కార్యదర్శిగా మంత్రి, కలెక్టర్ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న బి.అశోక్‌బాబు.

అనంతపురం రూరల్,ఆగస్టు17ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన సిబ్బందిని సమన్వయం చేసుకుంటు అంకిత భావంతో విధులు నిర్వహిస్తు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న బి.అశోక్‌బాబు సేవలు అమోఘమని పలువురు రాజకీయ నాయకులు, పంచాయితీశాఖ అధికారులు,ప్రజలు కొనియడారు. గ్రామంలో ఎటువంటీ సమస్యలు వచ్చిన ఆయన సచివాలయ ఉద్యోగులు,కార్మికుల సమన్వయంతో రాత్రింపగళ్ళు పనిచేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధికి ఈయన చేసిన సేవలను జిల్లా యంత్రాంగం గురించి గురువారం జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో మంత్రి పయ్యావుల కేశవ్,జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ బి.అశోక్‌బాబు ఉత్తమ పంచాయితీ కార్యదర్శి అవార్డును అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఉత్తమ కార్యదర్శి అవార్డు అందు కున్న బి.అశోక్‌బాబు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేస్తు ప్రజల సమస్యలను ఎప్పటీకి అప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అదే విధంగా గ్రామంలో ఎక్కడా అవినీతికి చోటులేకుండా ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరిస్తు పాలనను అందివడం జరుగుతుందన్నారు.78వ స్వాతంత్ర్య దినోత్సవ రోజున మంత్రి,కలెక్టర్ చేతుల మీదులుగా ఉత్తమ పంచాయితీ కార్యదర్శి అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ అవార్డు తనకు రావడంలో డిపిఓ, మండల పరిషత్ కార్యాలయ అధికారులు,ఎంపిటీసిలు,సచివాలయ ఉద్యోగులు కృషి ఉందన్నారు.ఈ అవార్డుతో మరింత ఉత్సహంతో ప్రజలకు సేవలు అందిస్తాన్నారన్నారు.

## ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

గుడిబండ, ఆగస్టు17, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పిసిగిరి గ్రామంలో శ్రావణ శనివారం సందర్భంగా శ్రీ ఆజంనేయ స్వామికి పిసిగిరి గ్రామ ప్రజలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తిలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించాఉ. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, మండల కార్యదర్శి మద్దనకుంటప్ప, మండల కార్యదర్శి ప్రకాష్, దుర్గేష్, క్లస్టర్ ఇంఛార్జ్‌లు లక్ష్మినరసప్ప, భీమరాజు, జయరామప్ప, తదితర తెదేపా, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21 లోపు వివరాలు తెలియజేయండి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 17 ప్రభాతవార్త

సుప్రీం కోర్టు, న్యూ డిల్లీ మరియు ప్రభుత్వం వారి ఆదేశాను సారం జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరీ లెట్రిన్స్ వివరాలపై సర్వే జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరీ లెట్రిన్స్ ఉన్నచో తదుపరి చర్య చేపట్టుటకు గాను సంబంధిత మున్సిపాలిటి లేదా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీ లోపు వివరాలను తెలియజేయాలని కోరారు.

**CHANGE OF NAME**

I, PENDAKANTI KISHORE KUMAR (old name) S /o P. Guruvaiah Residing at D. No. 7-230, Malleswari Road, Anantapur City & Dist-515 001. I have changed my name from PENDAKANTI KISHORE KUMAR (Old Name) to **PENDEKANTI KISHORE KUMAR** (New Name) for all Purposes

**CHANGE OF NAME**

I, PENDAKANTI SANDHYARANI (old name) W/o Pendakanti Kishore Kumar Residing at D. No 7-230, Malleswari Road, Anantapur City & Dist - 515 001. I have changed my name from PENDAKANTI SANDHYARANI (old name) to **PENDEKANTI SANDHYARANI** (New Name) W/o Pendekanti Kishore Kumar for all Purposes

**CHANGE OF NAME**

I, BANDLAPALLI JAMDRUDH (OLD NAME) W/O BANDIAPALLI BABA SAHIB, H.NO-26-4-618/5, SADASHIVA NAGAR, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM BANDLAPALLI JAMDRUDH (OLD NAME) TO **BANDLAPALLI JAMRUDH** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **BANDLAPALLI JAMRUDH** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I,THIRUMALI SHABBER (OLD NAME) S/O MAHABOOB PIRA, H.NO-7-82A, ARE PETA, MADAKASIRA, S.S-DT, A.P CHANGING MY NAME FROM THIRUMALI SHABBER (OLD NAME) TO **THIRUMALI SHABHEER** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **THIRUMALI SHABHEER** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I, AFSARI (OLD NAME ) W/O PEERAN MAHABOOB NAYEMULLA, H.NO-18-6-57, AZAD NAGAR, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM AFSARI (OLD NAME) TO **AFSARI BANU** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **AFSARI BANU** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I,BANDLAPALLI BABA SAHIB (OLD NAME) S/O BANDIAPALLI HUSSAIN SAHIB, H.NO-26-4-618/5, SADASHIVA NAGAR, HINDUPUR, S.S-DT,A.P CHANGING MY NAME FROM BANDLAPALLI BABA SAHIB (OLD NAME) TO **BANDIAPALLI BABA SAHIB** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **BANDIAPALLI BABA SAHIB** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I,THIRUMALI SAMEERA (OLD NAME ) W/O THIRUMALI SHABHEER, H.NO-7-82A, ARE PETA, MADAKASIRA, S.S-DT, A.P CHANGING MY NAME FROM THIRUMALI SAMEERA (OLD NAME) TO **SYED FIRDOUSE BANU** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **SYED FIRDOUSE BANU** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I, BHATTI NAVHEED AHAMMED (OLD NAME) S/O BHATTI NISAR AHAMMAD, H.NO-26-4-1136A, RTC COLONY, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM BHATTI NAVHEED AHAMMED (OLD NAME) TO **BHATTI NAVHEED AHAMAD** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **BHATTI NAVHEED AHAMAD** (NEW NAME) FOR ALL PURPOSES

**CHANGE OF NAME**

I, BHATTI NISHAR AHAMMAD (OLD NAME) S/O BHATTI YUSOOF SAHEB, H.NO- 26-4-1136A, RTC COLONY, HINDUPUR, S.S-DT, A.P CHANGING MY NAME FROM BHATTI NISHAR AHAMMAD (OLD NAME) TO **BHATTI NISAR AHAMMAD** (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED AS **BHATTI NISAR AHAMMAD** (NEW NAME) FOR ALL PURPOSES

Form No. 3
See Regulation - 15(1)(n)]

**DEBTS RECOVERY TRIBUNAL - I HYDERABAD (DRT-II)**

**1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD - 500001**

**Case No. TA /644/2017**

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

UNION BANK OF INDIA
**VS**
N V JAYAPRAKASH NARAYANA REDDY AND ANOTHER

**BETWEEN:**

Union Bank of India,(erstwhile Andhra Bank) is a body corporate constituted under the Banking Companies (Acquisition & Transfer of Undertakings) Act, 1970 and having its Head Office at No.239,Vidhan Bhavan Marg,Nariman Point, Mumbai - 400021 Union Bank of India(erstwhile Andhra Bank), Branch Office at Main Road, Near Registration office, Anantapur - 515001 Rep. by its Authorized Officer Mr. G.Rajesh, S/o. G.Peddanna, Aged about 38 years, Male, Mail ID:ubin0802174@unionbankofindia.bank **...Applicant**

**AND**

N V Jayaprakash Narayana Reddy, S/o Sathyanarayana Reddy, Hindu, Major, Occ: Business, Male,R/o 6-3-978, Maruti Nagar, Ramnagar, Anantapur. P Rama Lakshmi,W/o. P Amarnath, Hindu, Major,R/o.Flat No.506, Sai Ram Residency,Aravind Nagar, Ananthapur. **.Defendant**

**SUMMONS**

WHEREAS, OA/541/2023 was listed before the Hon'ble Presiding Officer on 03-07-2024.

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs. 22,83,549/-, application along with copies of documents etc., annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other ass

# 2023 ఖరీఫ్, రబీ పంటకాలాలకు ఇన్సూరెన్స్ ప్రకటించండి

## -మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించిన ఏపీ రైతు సంఘం

మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 17 ప్రభాతవార్త**

2023 ఖరీఫ్, రబీ పంట కాలానికి ఇన్సూరెన్స్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదన్, వి.శివారెడ్డి కోరారు. జిల్లాకేంద్రం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శనివారం వారు రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక,వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ పంట కాలాల్లో సరైన సమయంలో వర్షాలురాక అతివృష్టి, అనావృష్టివల్ల సాగుచేసిన వేరుశెనగ, పప్పుశెనగ, మిరప, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, అలసందులు, సోయాబీన్, ఉద్దులు, ఉలవలు, తెల్లకుసుమ తదితర పంటలకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. రైతులు పంటలపై పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాకపోగా అప్పులు మిగిలాయన్నారు. ప్రస్తుత ఖరీఫ్ పంట కాలంలో జిల్లాలో 3,64,733 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా సకాలంలో వర్షాలురాక 1,22,355 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయని 2,24,378 ఎకరాలను రైతులు బీడుకు పెట్టుకున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని అయితే కరువు నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించలేదని వెంటనే కేటాయించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 20వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని గత ఏడాది పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ప్రకటించాలని కోరారు. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించి, దిగుబడి ఆధారిత బీమా అమలు చేయాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై జీఎస్టీ రుద్ద చేయాలని, జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే జీవో నెంబర్ 22 రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, బి.చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, సుబ్బయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పెన్నానదికి జలకళ

ప్రవహిస్తున్న పెన్నానది

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 17 ప్రభాతవార్త**

తాడిపత్రి ప్రాంతంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అదేవిధంగా వర్షం నీరు చేరడంతో పెన్నానది ప్రవహిస్తోంది. కొన్ని నెలలుగా పెన్నానదిలో నీరు ప్రవహించక భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో భారీ వర్షం కారణంగా పెన్నానదికి నీరు చేరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పెన్నా పరివాహక ప్రాంతాల్లోని బోర్లలో నీటి మట్టం పెరగనుండడంతో పండ్లతోటలు, పంటపొలాలు సాగుచేసే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెన్నానది ప్రవహిస్తున్న విషయం తెలుసుకున్న ప్రజలు పెద్దఎత్తున నది వద్దకు చేరుకుని సందర్శించారు. దీంతో పెన్నానది పరిసరాలు సందడిగా మారాయి. పలువురు ప్రజలు పెన్నానదిలో గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు.

# యానిమేతలపై చర్యలేవి..?

## - అడుగడుగునా అవినీతే..అధికారులదీ అదే రీతే.!
## - సభ్యుల అమాయకత్వమే అక్రమాలకు పెట్టుబడి..!
## - రామరాజుపల్లిలో యానిమేటర్ అక్రమాలకు అధికారుల వత్తాసు

యాడికిలోని స్త్రీశక్తి భవనం



పొదుపుభాతాల్లో జమచేయని బ్యాంకు ధరావతు పత్రాలు

సభ్యులు ప్రాధేయపడితేనే ఏర్పాటు చేస్తున్న సమావేశాలు

**యాడికి(తాడిపత్రి), ఆగస్టు 17, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను స్థాపించింది. వీటిలో పదిమంది సభ్యులను గ్రూపుగా ఏర్పాటు చేసి వారిచే ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేయించి, బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించి వారిచే చిరువ్యాపారాలు స్థాపింపజేసి ఆర్థిక భరోసా కల్పించాలనేది సంఘాల ముఖ్యోద్దేశం. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. పేద మహిళలు కూలీ నాలీ చేసుకొని కష్టపడి సంపాదించిన సొమ్మును కొందరు యానిమేటర్లు గద్దల్లా తన్నుకుపోతున్నా వారిపై కనీస చర్యలు ఉండటం లేదు. డ్వాక్రా సంఘాల సభ్యులకు బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణలో ఆసరగా ఉండేందుకు గ్రామ సంఘాల తీర్మానాల ఆధారంగా సహాయకులుగా యానిమేటర్లను నియమించారు. మొదట్లో సక్రమంగా విధులు నిర్వహించినప్పటికీ కొందరు అధికారుల అండదండలతో అక్రమాలకు తెరలేపారు. దీంతో గ్రామీణ మహిళలు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోంది.



సభ్యురాలు కట్టకపోయినా కట్టినట్లు రాసిన మినిట్ పుస్తకం, మినిట్ పుస్తకంలో కట్టినట్లు, బ్యాంకు ఖాతాల్లో కట్టనట్లున్న స్టేట్‌మెంట్

**-రామరాజుపల్లిలో అక్రమాలకు అధికారుల వత్తాసు**

యాడికి మండలం రామరాజుపల్లిలో మహాలక్ష్మి సంఘంలో జరిగిన అవకతవకలపై విచారించమని అధికారులను ప్రాధేపడిన వారం రోజులకు గాని సంబంధిత అధికారులు స్పందించలేదంటేనే సంఘాలపై అధికారుల పర్యవేక్షణ ఏపాటిదో ఇట్టే అర్థమవుతోంది. ఒక సంఘంలోనే పలు అక్రమాలు

1.ఒక సభ్యురాలు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల బ్యాంకు లింకేజీ కంతులు కట్టకున్నా కట్టినట్లు తీర్మానంలో పుస్తకంలో రాసి యానిమేటర్ మభ్యపెట్టాడు.

2.సభ్యులకు అనుమానం రేకెత్తి బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుంటే అందులో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల కంతులు సదరు సభ్యురాలు కట్టనేలేదు. 3.ఈ విషయం బహిర్గతమవుతోందని తెలిసి ఆ సభ్యురాలితో మూడు నెలలకు సంబంధించిన రూ. 12 వేలకు రూ. 400 లు వడ్డీ కలిపి జులైలో చెల్లించేలా చేశాడు. ఈ విషయాన్ని అధికారుల వద్ద ప్రస్తావిస్తే తీర్మానం పుస్తకంలో పొరపాటున రాశాను అని యానిమేటర్ అనడం, అధికారులు కూడా తందానా అంటూ వంతపాడటం విడ్డూరం.

4. బ్యాంకు రుణం పొందాలంటే ఇంకా చెల్లించాల్సింది రూ. 84 వేలు ఉండగా ఒక్కొక్కరితో రూ. 12 వేలు వంతున రూ. 1.20 లక్షలు కట్టించినా అధికారులు నోరు మెదకపోవడం గమనార్హం. సభ్యుల పుస్తకాల్లో కట్టినట్లు రాసిన ఒక కంతు సొమ్ము పత్తాలేకుండా పోవడం గమనార్హం.

5.దిగిపోతున్న సభ్యురాలు చెల్లించిన పెండింగ్ కంతుల్లో ఆమెకు కూడా భాగం పంచడం, పత్తాలేకుండా పోయిన కంతు సొమ్మును మభ్యపెట్టే ప్రయత్నంలో దిగిపోతున్న సభ్యురాలు చెల్లించిన ఒక కంతును తెలివితో వెనక్కు తీసుకోవడం వంటి చర్యలను మొదట తప్పు పట్టిన అధికారులు యానిమేటర్ ఎదుట మాత్రం సక్రమమే అని కితాబునివ్వడం విమర్శలకు దారితీసింది.

6.బ్యాంకు రుణ బకాయి చివరి కంతు ఎంత చెల్లించింది తీర్మానం పుస్తకంలో రాయకపోవడాన్ని అధికారుల ఎదుట సభ్యులు ప్రస్తావిస్తే రాయించుకోవడం మీదే బాధ్యతని సభ్యులనే సీసీ, ఏపీఎం లు తప్పు పట్టడం విశేషం. పాత సభ్యురాలి తొలగింపు, కొత్త సభ్యురాలి చేరిక విషయంలో ఇతర సంఘాల్లో మాదిరి నిబంధనలు పాటించకుండా యానిమేటర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించినా సీసీ, ఏపీఎంలు నోరెత్తకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

7.కొత్త సభ్యురాలు చెల్లించిన రూ. 12 వేలనే పాత సభ్యురాలి బ్యాంకు రుణానికి, కొత్త సభ్యురాలి పొదుపు మొత్తానికి కూడా జమచేయడం యానిమేటర్ ఇష్టారాజ్యానికి ఉదాహరణ.

8.బ్యాంకు స్టేట్‌మెంట్ తీయకుంటే సంఘాల పుస్తకాల్లో సర్దుబాటు చేసేవాన్ని కదా అని, కోట్లు నష్టపోయినట్లు రాద్దాంతం చేస్తున్నారని యానిమేటర్ తమపై ఆగ్రహం వ్యక్తం చేయడం పట్ల సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

9.సంఘాల్లో అవినీతిని ప్రశ్నించిన సభ్యులనే దోషులుగా చిత్రీకరించడంలో సీసీ, యానిమేటర్లు సిద్ధహస్తులని ఇదే గ్రామంలోని మరో సంఘం సభ్యురాలి భర్త తీవ్రంగా విమర్శించడం విశేషం. అదే తీరునే మహాలక్ష్మి సంఘం సభ్యురాల్లదే తప్పన్నట్లు ఇటీవల సీసీ, యానిమేటర్లు మరోసారి చిత్రీకరించడం గమనార్హం.

10.సంఘాల పేరుతో ఉన్న బ్యాంకు డిపాజిట్ల బాండ్లను ఆయా సంఘాల ఖాతాల్లో జమచేసేలా చూడాల్సిన ఏపీఎం, సీసీలు వాటిగురించే పట్టించుకోవడం లేదు. ఈ సంఘాలకు చెందిన సీసీని బ్యాంకర్లు తమ చాంబర్లోకి కూడా అనుమతించకపోవడం అతని పారదర్శకత మసకబారింది అనడానికి నిదర్శనమనే చర్చ సాగుతోంది.

ఒక సంఘంలోనే ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతుంటే ఇక మండలంలోని 904 సంఘాల పనితీరును నిశితంగా పరిశీలిస్తే మరెన్ని అక్రమాలు వెలుగు చూస్తాయో అని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఃయాడికి సంఘాల నిర్వహణ ఎప్పుడూ వివాదస్పదే..!

యాడికి మండలంలోని సంఘాల నిర్వహణ, రుణాల మంజూరు, బకాయిల వసూళ్లు,యానిమేటర్ల అక్రమాలు వంటివి ఎప్పుడూ వివాదాస్పదమే. మండలంలో కొందరు యానిమేటర్లు, సీసీలు రూ. లక్షలు మేత మేయడం, రుణాల మంజూరులో మరి కొందరు యానిమేటర్లు చేతివాటం ప్రదర్శించడం, యానిమేటర్ల అక్రమ సంపాదన చూసిన కొందరు రాజకీయ నాయకులు ఆ యానిమేటర్ల పోస్టుల కోసం తీవ్రంగా ఒత్తిళ్లు చేస్తూ పోటీపడటం ఇక్కడ సర్వసాధారణం. ఇక్కడ పనిచేసిన ఏపీఎంలు, సీసీలు, యానిమేటర్లతో సహా తరచూ వివాదాలకు గురవుతుండటం ఉన్నతాధికారులకు తెలియనిది కాదని పలువురు సభ్యులు పేర్కొంటున్నారు. సభ్యుల అమాయకత్వమే పెట్టుబడిగా యానిమేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని, 60 శాతం మంది మహిళలు ఆర్థిక అక్షరాస్యత లేనివారే కావడంతో యానిమేటర్లు చెప్పిందే వేదంగా చెల్లుబాటు అవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా సెర్ప్ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి యానిమేటర్ల అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

# ప్రజా సమస్యలు తీర్చడంపై దృష్టి సారించండి

## -మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**అమరాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త**

అమరాపురం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్ఒ ప్లాంట్, చెరువు ఆయకట్టు కింద వస్తున్న మరువ వంకను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ భాస్కర్, గ్రామ కార్యదర్శి భాస్కర్, ఆర్ఐ గిరియప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రత్యూష, డాక్టర్లు అంబరీష్, మనోహర్‌నాయక్, తదితరుల సమక్షంలో ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో మురుగునీటితో పాటు వర్షనీరు నిల్వ వుండడంతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చే మహిళలు మరుగుదొడ్లు లేక పడుతున్న ఇబ్బందులపై అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్టీసి బస్టాండ్ దుర్గంధంతో కూడుకుని వుండడంతో పాటు సరైన మౌళిక వసతులు లేకుండా గుంతలమయంగా వుండడంతో తక్షణం ఆర్టీసి అధికారులు బస్టాండ్‌ను శుభ్రపరిచే విధంగా

ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న దృశ్యం

ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపిడిఒకు సూచించారు. అప్పటి వరకు ఆర్టీసి కాంప్లెక్స్ షాపులు అద్దె చెల్లించవద్దని యజమానులకు తెలిపారు. మరుగుదొడ్ల ఏర్పాటుకు కృషి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా ఆర్ఒ ప్లాంట్ మరమ్మతుకు నేటి నుండే పనులు ప్రారంభించి ప్రజలకు మంచినీరు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిని పరిశీలించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ అంబరీష్, మనోహర్‌నాయక్‌లకు సూచించారు. వైద్యశాలలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వక్క మార్కెట్ ఏర్పాటు చేయడానికి స్థానిక నాయకుల సమక్షంలో హలుకూరు వద్ద ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జెడ్‌పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, ఎస్‌సి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మండల ప్రధాన కార్యదర్శి జయరామప్ప, మారుతిప్రసాద్, దాదాపీర్, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, బిసి సెల్ తాలూకా ఉపాధ్యక్షులు మంజుతారక్, పార్లమెంట్ తెలుగు ఉపాధ్యక్షులు రఘు, టిఎన్ఎస్ఎఫ్ ప్రదాన ఆర్యదర్శి నవీన్, టిడిపి యువ నాయులు కెఎన్ఎం శివకుమార్‌యాదవ్, పట్టణ తెలుగుయువత అధ్యక్షులు నాగరాజు, నాగోనపల్లి మంజునాథ్, కెంకెర తమ్మరాయప్ప, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు చెన్నప్ప, డీలర్లు బంగారుపాళ్యం తిప్పేస్వామి, స్టూడియో హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి శివకుమార్, యంజారప్ప, ఉప్పరపల్లి శివకుమార్, పరమేశ్వరప్ప, కరిదాసనహట్టి కాంతరాజు, తమ్ముడేపల్లి హనుమంతరాయ, చంద్రశేఖర్‌గుప్తా, ఆర్‌డబ్ల్యుఎస్ రఘు, మాజీ సర్పంచు పాండురంగప్ప, శకునప్ప, కెఎన్‌పల్లి సురేష్, నింగరాజు, రామ్మూర్తి, ఎఎస్ఐ రామాంజినేయులు, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లు పాల్గొన్నారు.

# వర్షపునీరు వృధాకాకుండా చెరువులకు చేరేలా చూడండి

## - అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

నిత్యావసరసరుకులు అందచేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**పుట్లూరు, ఆగస్టు 17 ప్రభాతవార్త**

భారీవర్షం కారణంగా వర్షపునీరు వృధాకాకుండా పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హెచ్ఎల్‌సి అధికారులను ఆదేశించారు. మండలంలోని ఏ.కొండాపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా వరదనీరు వృధాగా వెళుతుండడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వరద ఉధృతి ఎక్కువగా వున్న నేపథ్యంలో పలుచోట్ల కాలువలకు గండిపడ్డాయని, వాటిని పూడ్చి చెరువులకు నీరు చేరేలా చూడాలన్నారు. గ్రామంలో లోతట్టు ప్రాంతంలో వున్న పాఠశాల భవనంలోకి వర్షపునీరు చేరడంతో పాఠశాలలోని పలు రికార్డులు పూర్తిగా తడిసిపోయి వుండడాన్ని గమనించి తాత్కాలికంగా విద్యార్థులకు ప్రభుత్వ భవనాల్లో వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. అంతేకాకుండా పలు ఇళ్లలోకి వరదనీరు చేరి ఇళ్లల్లో వున్న నిత్యావసరసరుకులు అన్ని పాడైపోవడంతో వారికి సరుకులు అందచేసి ప్రభుత్వ సాయం కోసం నివేదికలు పంపాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను గుర్తించాలని ఎమ్మెల్యే తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, ఎంపిడిఒ యోగానందరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామలింగారెడ్డి, ఎంఇఒ శ్రీదేవి, హెచ్ఎల్‌సి ఎఇ ఫణీంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలరంగయ్య, సత్యంరెడ్డి, గోవర్ధన్‌రాజు, శ్రీనివాసులునాయుడు, రామాంజి, వేణు, జయరామిరెడ్డి, నాగేష్, సోము, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాతుతున్న ఎమ్మెల్యే

# సంతలో పశువుల్లా మా కౌన్సిలర్లను కొన్నారు

## -ప్రజాస్వామ్యాన్ని టిడిపి ఖూనీ చేసింది - వేణురెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

**హిందూపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త**

హిందూపురం మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిల్ స్థానాల్లో కేవలం 6 మాత్రమే గెలిచిన తెలుగుదేశం నేడు మా పార్టీ కౌన్సిలర్లను సంతలో పశువుల్లా కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైసిపి నియోజకవర్గం నాయకులు వేణురెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా పార్టీలో వారు పెద్దసాచ లేమి కాదని ఆ దరిద్రము గలీజ్‌ను టిడిపిలో చేర్చుకుని నెత్తిన వేసుకుంటున్నారన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన నాయకులు తెలుగుదేశం పార్టీలో వున్నారని దానిని తాను కూడా అంగీకరిస్తానన్నారు. పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లు రానున్న ఎన్నికల్లో టిడిపి కౌన్సిలర్ టికెట్ తెచ్చుకుంటారా అని ఛాలెంజ్ చేశారు. హిందూపురం మున్సిపల్‌చైర్మన్ సీటును వాల్మీకి మహిళకు మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇవ్వగా నేడు మూడున్నర ఏళ్లు చైర్మన్ గిరిని చెలాయించి పార్టీ ఫిరాయించి నమ్మక ద్రోహం చేశారని విమర్శించారు. ఫ్యాన్ గుర్తుపై గెలిచిన వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరినందున వారు పదవులకు రాజీనామా చేసి ఇప్పుడే ఎన్నికల్లో నిలబడాలని ఒకవేళ మీరు గెలిస్తే తాను అంబేద్కర్ సర్కిల్‌లో తన ముక్కును నేలకు రాస్తానని సవాల్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు అవగాహన వుందో లేదో లేకపోతే పక్కన ఎవరైనా చెప్పిస్తున్నారేమో కానీ ఇలాంటి అప్రజాస్వామిక విధానాలకు పాల్పడి చెడ్డ పేరు తెచ్చుకోరాదని హితవు పలికారు. అదేవిధంగా చిలమత్తూరు మండలంలో కూడా ఆప్రజాస్వామ్యరీతిలో మండల ఎంపిపి కైవశం చేసుకునేందుకు ప్రయత్నించడం అందరికి తెలిసిందేనన్నారు. కాగా ఇప్పుడు కూడా వైసిపిలో కొందరు నమ్మకద్రోహులు వున్నారని వారు పార్టీలో నుండి వెళ్లిపోవచ్చని లేదా పార్టీ అధినేత సూచించిన విధంగా పనిచేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాన్య కార్యకర్తలు నేతలుగా ఎదుగుతారన్నారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లు శివకుమార్, ఆసిఫ్, మదన జయప్ప, వెంకటనాగేంద్రబాబు, నాయకులు బాలాజీమనోహర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు రాము, మన్సూర్, సీనియర్ నాయకులు శ్రీరామ్‌రెడ్డి, కౌన్సిలర్ రామచంద్ర, డాక్టర్ బాష, ఫారుక్, నరసింహులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ప్రహరీగోడను తొలగించకపోతే నేనే తొలగిస్తా

## -మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ప్రహరీగోను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అమరాపురం, ఆగస్టు 17 ప్రభాతవార్త**

అమరాపురం మండలం ఉడుగూరు గ్రామం వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే మడకశిర వైకాపా మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తన పొలానికి ఏర్పాటు చేసిన ప్రహరీగోడను తక్షణం తొలగించాలని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రజాప్రతినిధులు ఇలా రోడ్డునే ఆక్రమించుకుని ప్రహరీగోడ ఏర్పాటు చేయడం ఆహ్వాస్పదమన్నారు. ఉడుగూరు గ్రామాన్ని సందర్శన నిమిత్తం వెళుతున్న ఎమ్మెల్యే రోడ్డు పక్కనే వున్న ప్రహరీగోడ గురించి ఆరా తీశారు. స్థానిక ఆర్ఐ గిరియప్ప, గ్రామ కార్యదర్శి మహేష్, ఎఎస్ఐ రామాంజినేయులుకు నేటి సాయంత్రంలోపు ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే వున్న ప్రహరీగోడను తొలగించాలని ఆదేశించడంతో అధికారులు దీనిపై చర్చించడానికి స్థానిక ఆర్‌అండ్‌బి అధికారులకు కూడా సమాచారం అందించారు. అధికారులు కలిసి నేటిలోపు తొలగించకపోతే నేనే వచ్చి ఈ ప్రహరీగోడను తొలగించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, మాజీ జెడ్‌పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, ఎస్‌సి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్, మండల ప్రధాన కార్యదర్శి జయరామప్ప, మారుతిప్రసాద్, దాదాపీర్, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, బిసి సెల్ తాలూకా ఉపాధ్యక్షులు మంజుతారక్, పార్లమెంట్ తెలుగు ఉపాధ్యక్షులు రఘు, టిఎన్ఎస్ఎఫ్ ప్రదాన ఆర్యదర్శి నవీన్, టిడిపి యువ నాయులు కెఎన్ఎం శివకుమార్‌యాదవ్, పట్టణ తెలుగుయువత అధ్యక్షులు నాగరాజు, నాగోనపల్లి మంజునాథ్, కెంకెర తమ్మరాయప్ప, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు చెన్నప్ప, డీలర్లు బంగారుపాళ్యం తిప్పేస్వామి, స్టూడియో హనుమంతు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి శివకుమార్, యంజారప్ప, ఉప్పరపల్లి శివకుమార్, పరమేశ్వరప్ప, కరిదాసనహట్టి కాంతరాజు, తమ్ముడేపల్లి హనుమంతరాయ, చంద్రశేఖర్‌గుప్తా, ఆర్‌డబ్ల్యుఎస్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

**సిఐ, ఆర్‌అండ్‌బి అధికారుల జోక్యంతో సద్దుమనిగిన ప్రహరీగోడ సమస్య :**

మండలంలోని ఉడుగూరు గ్రామం వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనే మడకశిర మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తన పొలానికి ఏర్పాటు చేసిన ప్రహరీగోడను తక్షణం తొలగించాలని ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆర్ఐ గిరియప్ప, గ్రామ కార్యదర్శి మహేష్, ఎఎస్ఐ రామాంజినేయులుకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బి అధికారుల సూచనలు సలహాల మేరకు తొలగించడానికి సంబంధిత రోడ్లు భవనాలశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం స్థానిక సిఐ రాజకుమార్, అగళి, గుడిబండ, రొళ్ల ఎస్ఐలు సిబ్బందితో వచ్చి స్థానికంగా వున్న సమస్యను మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామితో ఫోన్ ద్వారా సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. రెండు రోజుల్లో సర్వే చేయించి ప్రహరీగోడను మార్చుకుంటామని తెలియచేయడంతో సమస్య సద్దుమనిగింది.

# సహకార సంఘాల సిఇఒలతో సమీక్ష సమావేశం

## - జిల్లా కలెక్టర్, ఏడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ వినోద్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 17 ప్రభాతవార్త**

నగరంలోని అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిఇఒలతో ప్యాక్ కంప్యూటరైజేషన్‌పై శనివారం జిల్లా కలెక్టర్, ఏడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ వినోద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాల్లో రైతుల వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. కంప్యూటర్ నమోదు కార్యక్రమంలో ఆయా పరిధిలోని బ్యాంకు సిబ్బంది, మేనేజర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎక్కడ అలసత్వం జరగకూడదన్నారు. కంప్యూటర్ నమోదు కార్యక్రమం చేయని సహకార సంఘాలపై పునరాలోసిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, డిసిఒ అరుణకుమారి, డిపిఒ ప్రభాకర్‌రావు, డిఆర్‌డిఎ పిడి ఓబుల మ్మ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, డిసిసిబి సిఇఒ స్వరూపారాణి, డిఎల్‌పిఒ ప్రభాకర్‌రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు